# "అబ్బ! పోదురూ! మీరు మరీనూ!"




"ఏమండీ" లోపలినుండి సన్నని మృదు వైనకంఠం పిలిచింది.

"..............................."

"అబ్బ! మీతోవేగలేక చచ్చిపోతున్నా! ఎని మిదయింది! మీరాతకాస్త కట్టిబెడుదురూ! వంటయింది" తిరిగి కోమలస్వరం రెట్టించి కేకవేసింది.

సమాధానంలేదు.......

జవాబూ ఇచ్చేస్థితిలోలేడు నారాయణ. అతను రాస్తున్ననవల మంచిరసఘట్టంలో వుంది. ప్రియురాలు ప్రియుడితో దీనంగా ఏడుస్తూ బ్రతిమాలుతోంది. కథానాయకుడు ఆమె మొర ఆలకించటంలేదు....

నారాయణకలం చాలా వడిగా పరుగులు తీస్తోంది. అతని భావాలు మరింతవేగంతో ఉరకలువేస్తున్నాయి. అతడిచేతిలోని సిగరెట్ అతని యిష్టాయిష్టాలతో నిమిత్తం లేదన్నట్లు కాలుతోంది. కాగితాలు నిండిపోతున్నాయి' కలంలో సిరా కొద్దిక్షణాలకే అయిపోతోంది.

"వినిపించడంలేదూ మీకు! ఈ పాడురాతలతో తలపాడుచేసుకోవడంతప్ప ఎందుకు చెప్పండి! తిండీతిప్పలూ, నిద్రాహారాలు మానేసి ఏమిటండీ ఈపనులు"! అంటూ నారాయణ శ్రీమతి హాలులోకి ప్రవేశించింది.

నారాయణ చాలా తీక్షణంగా ఆలోచిస్తున్నాడు. నవలారచనకు అంతరాయం తగిలింది! అలల్లా తేలిపోయే భావాలు తిరిగి మనసులోకి తెచ్చుకొని కాగితంమీద వ్రాసి పారెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు.... కథానాయకి ఏడుపునెలా వర్ణించడం? ఆ ఏడుస్తున్న సమయంలో ఆమెకళ్ళు ఎలావుండాలి? ముఖం ఎలామారాలి?.... కలం ముందుకునడవను ఏంచేస్తావో చూస్తానన్నట్లు బిర్రబిగిసి ఆగిపోయింది....

"అలసిపోయారుగాని ఇక లేవండి! భోంచేద్దురుగాని"! అంది నారాయణ చేతిలోనుండి కలాన్ని లాక్కుని అతనిశ్రీమతి స్వాహా.

నారాయణ భార్య ముఖంలోకి అదోలా చూశాడు....

స్వాహా ముఖం అప్పుడే వికసించిన పుష్పంలా ఆకర్షిస్తోంది....

నల్లని సర్పాల్లా నిగనిగలాడే ఆమె జంట జడలు నారాయణ అవస్థనుచూసి సిగ్గుతో స్వాహావెనుక దాగొన్నాయి.... చెదరి ముఖం మీదపడే ఆమె ముంగురులు నారాయణ కవిత్వధోరణికి బెదరి వణకుతున్నాయి....

---

రచన :

**శ్రీ కొంపెల్ల శివసుబ్రహ్మణ్యం**

---

"అబ్బ! ఏమిటండీ ఆమాపు! మీరు మరీనూ"! అంది తన కళ్ళలోకి సీరియస్‌గా చూస్తున్న నారాయణను చూసి సిగ్గుతో తల దించుకొనిస్వాహా....

ఆమె మాటలు నారాయణ చెవినిసోకటం లేదు.... ఊహాప్రపంచంలో తననవలలోని నాయకీనాయకుల విషాదఘట్టాన్నిగూర్చి ఆలోచిస్తున్నాడు....

"అయితే మీరు భోజనానికి రారన్నమాట! పోన్లెండి"! ఆమె చిరుకోపంలో కూడా వయ్యారంకనబరుస్తూ కలం చేతితోపుచ్చుకొని పోబోయింది....

నారాయణ ఈలోకంలోకి వచ్చాడు.

తనచేతిలో కలంలేదు. ప్రక్కగాచూశాడు. కలంపుచ్చుకొని విసురుగాపోబోతున్న ఆమె జడలను అమాంతంగా పట్టుకొని వెనక్కి.... తనవైపుగాలాగాడు.

"అబ్బబ్బ! వదలండీ!" అందినారాయణ చేతులోనుండి తన జడలను వదలించుకోబోతూ స్వాహా.

"ఇదెక్కడి సరసం స్వాహా! కలమేకదా కవిఆయుధం! అది కాస్తా నువ్వుతీసుకొనిపోతే ఈ బ్రహ్మాండమైన నవలగతి ఏంకానూ!" అన్నాడు లాలనగా స్వాహాను దగ్గరగా లాక్కొంటూ.

"భోజనం; నిద్రా మానివేసి ఎలారాస్తారండీ మీకవులు?" ఆశ్చర్యంగా కళ్ళువంకరగాతిప్పి అందిస్వాహా.

"నీకేం తెలుసు అందులోని ఆనందం? ఒక చిన్నసహాయం చేసిపెట్టాలి!" అన్నాడు నారాయణ.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది భర్త కళ్ళలోకి స్వాహా.

"ఒకసారి ఏడవాలి నువ్వు!" అన్నాడు అమాంతంగా నారాయణ.

"ఛా! రామ రామ! అదేంమాటలండీ!" అంది మందలిస్తున్నట్లు ముఖకవళికలు మార్చి స్వాహా.

"నిజం స్వాహా! నువ్వు ఏడవాలి! ఏడుస్తూ నాముఖంలోకి చూడాలి! నేను ఆ సమయంలో నిన్ను చూడాలి? నాచేతిలోకి కలం రావాలి! నువ్వు మింటికేకధారగా కన్నీటితో హృదయాన్ని కరిగించేలా ఏడుస్తే ఈనవల అత్యద్భుతంగా తయారవుతుంది! ఏడుమరి?" బ్రతిమాలుతున్నట్లు అడిగేడు నారాయణ.

స్వాహాముఖం సిగ్గుతో కందిపోయింది .... భర్తమాటలతీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

"ఆపండి మీ రామాయణం! వేళాకోళానికి వేళాపాళాలేదు! మీరు మరీనూ!'' ముఖంలోకి విసుగుదల తెచ్చిపెట్టుకుంటూ అంది స్వాహా.

''వేళాకోళమంటావా ప్రాణేశ్వరీ ! నీవల్ల భుని రసవత్తర ప్రసిద్ధనవల అనతికాలంలో పేరుప్రఖ్యాతులు గడించి ప్రజాభిమానాన్ని చూరగొనే శుభతరుణంలో అతడి రచనాశక్తిని శక్తిసామర్థ్యాలనూ వేళాకోళమని.... అలా తీసిపారేస్తావా! ఇంతటి గొప్ప రచయిత అర్ధాంగిఅయిన భాగ్యానికి ఉప్పొంగి ఉర్రూతలాడవలసిన నీవే నా కవితాశక్తిని నిరుత్సాహపరుస్తావా?'' అన్నాడు నారాయణ స్వాహా బుగ్గమీద చిటికవేస్తూ.

"అయ్యో! ఇదెక్కడిగొడవండీ! మీగోల వినలేక నాచెవులు చిల్లిపోతున్నాయి''


"అందుకే నామాటవిని ఒక్కసారి ఏడు ! మంచి బహుమతీ ఇస్తాను!''

"మీ బహుమతీ ఏమిటో నాకు తెలుసులెండి! అయినా ఏడవవలసిన గతి నాకేం పట్టిందండీ?'' చురచురా చూసింది నారాయణను.

"గతిపట్టకపోయినా పతికోరికమీద సతి ఏడవవచ్చని భగవద్గీతలో రాశాడు మిల్టన్ శాస్త్రజ్ఞుడు! నువ్వు కంటతడిపెట్టి ఏడ్చావంటే ప్రజలంతా దుఃఖించెదరు.

"నాకర్థం కావటంలేదు మీ మాటలు....!"

"నీకేమిటి? పేరుముందు అ ర ద జ ను టైటిల్స్అంటించుకొనే గొప్పగొప్ప ప్రముఖులే నా మాటలు అర్థంచేసుకోలేక అవస్థపడి గగ్గోలుపడుతున్నారు! నామాట విను స్వాహా ! నానవల పూర్తికావచ్చింది! మంచి సస్పెన్స్‌లో ఆగిపోయింది. కథానాయకి ఏడ్చి కథానాయకుడి హృదయం కరిగించి కదలించి వెయ్యాలి! కాని వచ్చిన సమస్యేమిటంటే ఆ కథానాయకి వివిధంగా ఏడ్చిందని వర్ణించడం! అందుకేనిన్ను ఓమారు ఏడవమని ప్రాధేయపడుతుంటి! మత్తెక్కించే నీచక్కని కళ్ళలోనుండి కన్నీరు నీబుగ్గలమీదుగా ప్రవహించి నీ యెత్తయిన వక్షోజాలను తడుపుతూంటే.... ప్రియుడు కాళ్ళమీదపడి దుఃఖాశ్రువులతో అతని పాదాభిషేకం చేస్తూ 'నన్నపార్థంచేసుకోకు' అని ప్రాధేయపడుతూంటే పాఠకులు నవలలో లీనమై కంటతడిపెడతారు! నీభర్తపేరు దిగంతాలవరకూ వ్యాపిస్తుంది .... కనకాభిషేకం, సన్మానాలు చేసెదరు....! తెలిసిందా స్వాహా! అందుకే నిన్ను ఇంతగా ఏడవమని గగ్గోలుపెడుతుంటం!''



ఆశగా స్వాహా అంగీకారంకోసం ఎదురుచూశాడు నారాయణ.

ఆమెకు మతిపోతోంది.... భర్త కవిత్వధోరణికి పిచ్చెత్తేలావుంది.

"మీకూ మీనవలకూ దండంబాబూ! నాకు ఆకలివేస్తోంది! నేపోతా! అబ్బ! వదలండి! మరీనూ!" అంది నవ్వును పెదవులలో నొక్కిపెట్టి స్వాహా లేవబోయి....

"లాభంలేదు! నువ్వు ఏడిస్తే నిన్నువదలదం! కాదని మొండిపట్టుపట్టావో నిన్నిలాగే చేతుల్లోబంధించి ఉక్కిరిబిక్కిరిచేసి మరీ ఏడ్పిస్తా!"

"మీరు ఎన్ని చెప్పండి! మూడ్‌బాగుండలేదు ! జీవాత్మ గోలపెడుతోంది ! తీరికచూసుకుని ఏడుస్తా! మరిరండి! భోజనం చేద్దురుగాని!" అంది నారాయణ చేతులుపట్టుకొని రమ్మన్నట్లు స్వాహా. నారాయణకు కోపం వచ్చింది కళ్ళు ఎర్రబడ్డాయి....

"అసలు నీలాంటి కళాహృదయం లేనిదాని మెడలో పుస్తెకట్టడమే పెద్దపొరబాటు! ఏదో పాపం భర్త అడక్క అడక్క ఒక్కసారి ఎలుగెత్తి ఏడవమని బ్రతిమాలుతుంటే....ఏ భార్య కాదనగలదు! నా కోరికను తిరస్కరించావ్ ! ఫో! నీతో మాట్లాడను!" అనేశాడు నారాయణ.

స్వాహా ఆమాటలు విని పగలబడినవ్వింది.

నారాయణముఖం జేవురించింది. అక్కడనుండి విసురుగాలేచి వెళ్లిపోయాడు బయటకు. స్వాహా విస్తుపోయింది....

* * *

రాత్రిపదయింది నారాయణ తిరిగిరాలేదు. అనవసరంగా చిన్న విషయానికి తనభర్త ఇంతగా పట్టించుకొని తిండిమానేస్తాడని స్వాహా ఊహించలేదు.... నిజమే! తనభర్త కథలు అద్భుతంగా వ్రాస్తాడు. ఒక్కొక్క కథలో తనను ఒక్కొక్కరీతిగా వర్ణించును. ఆంధ్రరచయితలలో తన భర్తకు ప్రత్యేకమైన స్థానంవుంది.... అతడి రచనలు అత్యధికంగా ప్రజాభిమానాన్ని చూరగొంటున్నాయి. కళాహృదయం నారాయణది. అతడిదారేవేరు. స్వాహాకుతెలుసు నారాయణ కవనాశక్తి. పత్రికలలో ఎప్పుడూ ఏదోఒకటి వ్రాస్తూనేవుంటాడు నారాయణ.

ఒక పబ్లిషర్ విషాదపూరితమైన నవలరాసి తమకిమ్మని నారాయణను అడిగేరు. నాథా

యణ కాదనలేకపోయాడు. మూడు వందల రూపాయలకు స్థిరపరచి నవలారచన కుపక్రమించాడు నారాయణ....

స్వాహా మనసు బాధపడింది. భర్తతన మాటలవల్ల నొచ్చుకొన్నాడేమోనని.... ఎదురు చూస్తూ సుమారు పన్నెండు గంటలవరకూ భోజనం చేయకుండా వుంది స్వాహా నారాయణ కోసం. కళ్ళు మూసుకొనిపోతున్నాయి. ఆకలి దహించేస్తోంది, ఆవులింతలు విపరీతంగా వస్తున్నాయి. మరోపావుగంటకి నారాయణ వచ్చాడు.

మౌనంగా పడకగదిలోకి వెళ్లిపోయాడు....

"ఏమండీ! చాలాసేపైంది! కోపంతో భోజనం మానేస్తే ఎలా?" అంది అతనిని సమీపించి స్వాహా....

"నాతో మాట్లాడకు! నన్ను విసిగించకు!అవతల ప్రక్కకుత్రిప్పిపడుకొన్నాడు నారాయణ.

స్వాహాలో ఆత్మాభిమానం గాయపడింది. తానుమాత్రం ఏమందని? అయినా భర్త అడిగినదిమాత్రం సబబుగా వుందా! తనను ఏడవమంటాడా! చిన్నవిషయాన్ని మనసులో కి పట్టించుకొని తనలో మాట్లాడనని భీష్మించుకుని కూర్చోవడం బాగుందా!

వేరొక మంచంమీద బాధగా పడుకొంది స్వాహా, ఏమిటో ఆదోలావుంది ఆరాత్రి. ఆమెకు ప్రతీరాత్రి వెచ్చని కౌగిలిలో మైమరచి మధురానుభూతులు చవిచూసే స్వాహాకు ఆరాత్రి నిద్రపట్టలేదు....

తెల్లవారింది.... ఏడయింది.

నారాయణ బద్ధకంగా లేచాడు....ఆశ్చర్యం!

స్వాహా ఇంకా మంచంమీదనుండి లేవనేలేదు. ప్రతిరోజూ ఆరుగంటలయేసరికల్లా కాఫీ చేత్తోపుచ్చుకొని తనకు మేలుకొలుపులు పాడే స్వాహా.... నిద్రమేల్కొనేలేదు....

దంతధావనం మొదలైన కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేసి తనగదిలోకి వచ్చాడు. అప్పటికి ఉదయం ఎనిమిదయింది. స్వాహా లేవనేలేదు.... పిలుద్దామనుకొన్నాడు! మరుక్షణంలో గతరాత్రి తానుచేసినశపథం గుర్తుకు వచ్చి ఆ ప్రయత్నం అతిబాధగా ఆపుచేసుకొన్నాడు. బయటకువెళ్లి అయ్యార్ హోటల్లో అపురావురుమనే ఆకలిని ఆహుతిచేసి కాఫీ సేవించి శ్రీమతికోసం వేడిఇడ్లీ, పెసరట్లు పొట్లంకట్టించి, ఇంటికి చేరాడు నారాయణ.

గతరాత్రి జరిగిన సంఘర్షణ, ఇంకా చల్లారలేదు.

"స్వాహా" అన్నాడు మెల్లగా ఆమె మంచం మీద ఆమెప్రక్కనే కూర్చుని నారాయణ.

స్వాహా ప్రక్కకు తిరిగి దుప్పటి కప్పుకుంది మౌనంగా.

"చూడుస్వాహా! నిన్నరాత్రి....! అని ఆమె నడుంమీద చేయివేసి దుప్పటి తీయబోయాడు. ఆమె తిరిగి ముసుగుతన్ని పడుకుంది విసురుగా....

"నామీదకోపమొచ్చిందా! అన్నాడు స్వాహా శిరోజాలు నిమురుతూ.

"నన్ను విసిగించకండి! నాతోమాట్లాడవద్దు!" అంది కఠినంగా స్వాహా. పక్కుమని నవ్వాడు నారాయణ.

"ఓ! ఇదా నీ సత్యాగ్రహానికి కారణం! పోన్లే! అయిపోయిందేదో అయిపోయింది! లేచి ముఖప్రక్షాళనం చేసుకొని టిఫిన్‌తిను! రాత్రి పాపం భోజనం చెయ్యలేదు కాబోలు!" అన్నాడు నారాయణ ఆమె భుజం పట్టుకొని లేవదీయబోతూ....

ఆమె కళ్లల నీరు గిర్రున తిరిగింది. జారిపోతున్నపయిటతో వక్షద్వయాన్ని కప్పుతూ కొంగుతో ముక్కు తుడుచుకొని కొరకొరా చూసింది నారాయణను.

నారాయణ హడలిపోయాడామె అవతారం చూసి. ఆమె శిరోజాలు చెదరిపోయాయి. ముఖంనిండా స్వేదబిందువులు అల్లుకొని వున్నాయి.

"ఎందుకలా బాధపడతావ్ పిచ్చిదానా? క్రొత్తకాపురం అన్నతర్వాత మాటపట్టింపులూ, అభిప్రాయభేదాలు, ప్రణయకలహాలూ వస్తునే వుంటాయి! కొంతకాలానికి ఒకరికొకరం అలవాటయిపోతాం! లే!" అన్నాడు బుజ్జగిస్తున్నట్లు నారాయణ.

ఆమె ఏడుపు లంకించుకుంది.

గతరాత్రి వారిద్దరిమధ్యా జరిగిన వాగ్వివాదం జ్ఞాపకంవచ్చి భోరుమని ఏడ్వసాగింది. నారాయణ మనసులో ఏదోమెరసింది అయిడియా! తనగదిలోకి వెళ్ళి అసంపూర్తిగా నున్న నవల తీసుకొనివచ్చాడు. స్వాహాశోకపు వాన ఇంకా వెలియలేదు.

"కరక్ట్! ఆదేపోజు! ఆపకు! ఏడు! వెరిగుడ్! అదేనేనునిన్నరాత్రి కావాలంట!" గట్టిగా ఆనందంతో కేకపెట్టాడు నారాయణ.

స్వాహాఅకస్మాత్తుగా ఏడుపు ఆపేసింది. కోపంగా భర్తను చూసింది.

"చూడు డియర్! మళ్లీ ఒక్కసారి ఇందాకటి పోజియ్యి! కథానాయకి విలపిస్తున్నట్లు కనిపిస్తోంది! ప్లీజ్!" ఆమె గడ్డంపట్టుకుని బ్రతిమాలుతున్నాడు నారాయణ.

"ఊహూఁ!" స్వాహా ముఖకవళికలు శోకంనుండి మారాయి.

"ప్లీజ్ .... స్వాహా!" నారాయణ దీనంగా అడిగాడు తిరిగి స్వాహాను.

"నేను ఏడవను!" ఠకీమని చెప్పేసింది లేచి కూర్చుని కంటినీరు తుడుచుకొని.

"మంచి బహుమతీ ఇస్తాగా!"

"మరి నిన్నరాత్రి మాటేమిటి.........!"

"నిన్నటిదీ ఈవేళదీ కూడా కలిపి! ఒక్కమారు ఏడ్పుముఖం పెట్టుమరి!"

"అబ్బ! పోదురూ! మీరు మరీనూ!" అంది స్వాహా నారాయణ శరీరానికి హత్తుకోపోయి రెండు వేడిహృదయాలమధ్యా తానెందు కడ్డం అన్నట్లు పయిట ప్రక్కకు తొలిగి నేల పడింది.

